
ఈనాడు
పల్నాడు
శనివారం అక్టోబరు 5, 2024



పిడుగురాళ్లలో రూ.40 లక్షల కరెన్సీతో వాసవి అమ్మవారికి అలంకరణ



వినుకొండ మండలం విఠంరాజుపల్లి శాంతి ఆశ్రమంలో గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు



మాచర్ల: బతుకమ్మలతో ప్రదర్శనగా వస్తున్న మహిళలు

దసరా శోభ

దసరా నవరాత్రి మహోత్సవాలతో జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. ఆలయాల్లో అమ్మవారికి వేకువజామున అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుదీరారు. ఈ సందర్భంగా గుడుల్లో కుంకుమ పూజలు, చండీ హోమం నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం

నేడు పీఎం కిసాన్ సొమ్ము జమ

ఈనాడు-అమరావతి : పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద కేంద్ర ప్రభుత్వం 18వ విడత నిధులను శనివారం రైతుల ఖాతాలకు జమ చేస్తుంది. దీని ద్వారా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 4,24,872 మంది రైతులకు రూ.84.97 కోట్ల సొమ్ము లబ్ధి చేకూరనుంది. పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.6 వేల సొమ్మును కేంద్ర ప్రభుత్వం జమ చేస్తోంది. ఈ ఏడాది రెండో విడత కింద ఇప్పుడు రూ.2వేలు జమ చేస్తోంది. ఈ సొమ్ము జమ కావాలంటే రైతులు బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంది.

జిల్లాలో రైతులు :	1,97,639
జమ చేసే సొమ్ము :	రూ.39.53 కోట్లు

నాటి నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యాలు

అధ్వాన కాలువలతో పొలాలకు పారని నీళ్లు

సాగర్ ఆయకట్టు రైతుల ఆవేదన

ఈనాడు-నరసరావుపేట

నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలో ఐదేళ్ల వైకాపా పాలనలో కనీస నిర్వహణ, మరమ్మతు చేయకపోవడంతో కాలువలు అత్యంత అధ్వానంగా తయారయ్యాయి. ప్రస్తుతం సాగర్ జలాశయంలో పుష్కలంగా నీటి లభ్యత ఉండటంతో కాలువల సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తున్నా ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితి. కాలువలు పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయి నీటి ప్రవాహం ముందుకు సాగని దుస్థితి. పిచ్చిమొక్కలు పెరగడంతో కాలువ గట్ల వెంబడి రైతులు కూడా వెళ్లడానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. గతేడాది సాగర్ కాలువల కింద పంటలకు సాగు నీరు విడుదల చేయకపోవడంతో మరింత అధ్వానంగా మారాయి. వైకాపా ఐదేళ్ల పాలనలో చేసిన నిర్లక్ష్యం ఇప్పుడు సాగుదారులకు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటప్పటికే జూన్ నెల తొలివారం రావడంతో అప్పటికే వర్షాలు మొదలయ్యాయి. కాలువల మరమ్మతుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపేటప్పటికీ జులై నెల దాటిపోయింది. కృష్ణానదిపై జలాశయాలు నిండటంతో కాలువలకు నీటివిడుదల మొదలైంది. ఈ నేపథ్యంలో పనులు చేపట్టడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చి పనులు చేయడానికి సమయం పడుతున్నందున రైతులే కమిటీలుగా ఏర్పడి పనులు చేయడానికి సిద్ధమయ్యారు.



ఆకురాజుపల్లి మేజరు కాలువలో పిచ్చి మొక్కలు ఇలా..

306 పనులు.. రూ.26 కోట్లు

సాగర్ కుడికాలువ పరిధిలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కాలువల మరమ్మతుకు 306 పనులతో రూ.26 కోట్లకు జలవనరులశాఖ ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే వెంటనే పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తూ అనుమతులు రావాల్సి ఉంది. మరోవైపు ఇప్పటికే పంటల సాగు మొదలైనందున నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించడానికి రైతులు కొందరు జేసీబీలు పెట్టి అక్కడక్కడ పనులు చేసుకుంటున్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు మూడు జేసీబీలు పెట్టి కాలువల్లో నీటిప్రవాహానికి అడ్డంకులు ఎక్కడైనా ఉన్నట్లయితే జేసీబీల సాయంతో పని చేసుకునేలా రైతులకు వెసులుబాటు కల్పించారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రైతులతో సమావేశం నిర్వహించి ఆయా కాలువల పరిధిలో కమిటీలు వేసి వాటి ఆధ్వర్యంలో జేసీబీలతో కాలువలు బాగు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసే వరకు వేచిచూడకుండా నియోజకవర్గంలో కాలువలు బాగు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటకు సాగు నీరు సకాలంలో అందించడానికి చర్యలు చేపట్టారు.

3253 కిలోమీటర్ల పొడవున కాలువలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగర్ కుడి కాలువ కింద ప్రధాన కాలువ, బ్రాంచ్ కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, డబ్ల్యూఏలు కలిపి 3253.953 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నాయి.

విభాగం	దూరం (కిలోమీటర్లు)
ప్రధాన కాలువ	137.443
బ్రాంచ్ కాలువలు	173.370
డిస్ట్రిబ్యూటరీలు	891.658
డబ్ల్యూఏలు	2051.482
మొత్తం	3253.953

కుడి కాలువకు 10675 క్యూసెక్కులు

సాగర్ కుడికాలువ కింద నీటి అవసరాలు పెరగడంతో 10675 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్ నుంచి 3757 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పత్తి ద్వారా 6918 క్యూసెక్కుల నీటిని కాలువకు వదులుతున్నారు. సాగర్ జలాశయంలో గరిష్ఠ నీటి మట్టం కొనసాగుతున్నందున కుడి కాలువకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. బ్రాంచ్ కాలువలకు వాటి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తున్నా మేజరు, మైనరు కాలువలు అత్యంత అధ్వానంగా ఉండటంతో నీటివృథా ఎక్కువగా ఉండి చివరి భూములకు సాగునీరు అందడం లేదు. జలాశయంలో నీటిలభ్యత ఉన్నా పొలాలకు సాగునీరు అందని పరిస్థితి. ఎండలు ఎక్కువగా ఉండటంతో సాగునీటి అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. భారీవర్షాల తర్వాత ఎండలకు పంటలు వడలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ ఇంజినీర్లు అప్రమత్తమై రైతులకు సాగు నీరు సక్రమంగా అందేలా చూడాల్సి ఉంది.

ఏఎన్‌యూకి ఐఎస్‌వో గుర్తింపు

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఐఎస్‌వో 9001:2015 ధ్రువపత్రం సాధించింది. నిర్వహణ, విద్యాప్రమాణాలు, మౌలిక వసతులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నందున ఈ ధ్రువపత్రం లభించిందని ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ చెప్పారు. అభివృద్ధి, నాణ్యత ప్రమాణాలు, విద్యాపరమైన అంశాలను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ గుర్తింపుతో విశ్వవిద్యాలయం ఖ్యాతి మరింత పెరిగిందని వీసీ వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామని, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఆచార్యులు ప్రమీలారాణి, పాల్‌కుమార్, అశోక్‌కుమార్, రవికుమార్, ఐక్యూఏసీ సంచాలకులు కృష్ణ సత్య, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

చేరిన ఎన్‌ఐఆర్ఎఫ్ ర్యాంకుల ధ్రువపత్రాలు

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్ఎఫ్) ఆగస్టులో విడుదల చేసిన ర్యాంకింగ్స్ ధ్రువపత్రాలను శుక్రవారం ఏఎన్‌యూకి పంపించింది. ఓవరాల్ జాతీయ స్థాయిలో 97, విశ్వవిద్యాలయాల జాబితాలో 59, రాష్ట్ర స్థాయిలో 20, ఫార్మసీ కళాశాలకు 63 ర్యాంకులను ఏఎన్‌యూకి కేటాయించింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఈ సారి 100లోపు నాలుగు ర్యాంకులు సాధించామన్నారు. అందరూ కష్టపడి ఈ సారి మరింత మెరుగైన ర్యాంకు సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఇతర విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ఐఎస్‌వో ధ్రువపత్రం ప్రదర్శిస్తున్న వీసీ గంగాధర్, ఆచార్యులు

యడ్లపాడు ఎంఈవో-2కు రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల

యడ్లపాడు, న్యూస్‌టుడే : యడ్లపాడు ఎంఈవో-2 అరుణకుమారికి మేజర్ పనిష్మెంట్ కింద రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ గుంటూరు ప్రాంతీయ విద్యా సంచాలకుడు (ఆర్‌జేడీ) బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె గతంలో చిలకలూరిపేట శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసిన సమయంలో నాడు- నేడు పనుల్లో రూ.10,99,350ను థర్డ్ పార్టీ అయిన ఎస్. సుజాతకు నిబంధనలకు వ్యతిరేకంగా చెక్కు ఇవ్వడంతో పాటు ఎక్కువ మొత్తంలో ఇసుకను స్థానికంగా కొని వే- బిల్లులు సమర్పించక పోవడం వంటి కారణాలతో గతేడాది డిసెంబరు 21న విధుల నుంచి కలెక్టర్ సస్పెండ్ చేశారు. తర్వాత తన మీద వచ్చిన ఆరోపణలను తిరస్కరిస్తూ అరుణకుమారి వివరణ ఇచ్చారు. వాటి ఆధారంగా యడ్లపాడు ఎంఈవో-2గా తిరిగి నియమిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 7న ఉత్తర్వులిచ్చారు. ఆరోపణలపై నరసరావుపేట ఉపవిద్యాశాఖాధికారిని విచారణకు నియమించారు. విచారణలో ఆరోపణలు రుజువు కాగా క్రమశిక్షణ చర్యల కింద రెండు ఇంక్రిమెట్లను నిలుపుదల చేశారు.

జల్‌జీవన్ మిషన్ పథకం పనుల్లో పురోగతి

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇప్పటి వరకు నిర్వహించిన 25 శాతం పైబడిన పనులను కొలతల పుస్తకాల్లో నమోదు చేసి ఉంటే, వాటిని పూర్తి చేయించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ జిల్లా అధికారి (ఈఈ) విజయకుమార్ సూచించారు. నరసరావుపేటలోని గ్రామీణ నీటి సరఫరా జిల్లా కార్యాలయంలో పథకం పనులపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 25 శాతం కంటే తక్కువ, ఇంకా పనులు ఆరంభించని వాటిపై తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు వేచి చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, చెరువుల్లో రక్షిత నీటి నిల్వల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఈఈ విజయకుమార్

నడికూడి-శ్రీకాళహస్తి మార్గంలో రైళ్లు నడపండి

రైల్వే జీఎంకు ఎంపీ లావు వినతి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: పల్నాడు జిల్లా పరిధిలో రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధి, ఇతర ప్రాజెక్టులకు సంబంధించి నిధులు విడుదల చేసి పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. శుక్రవారం విజయవాడలో జరిగిన రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన సమీక్ష సమావేశంలో ఎంపీ లావు పాల్గొని జిల్లాకు సంబంధించిన వివిధ ప్రతిపాదనలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. నడికూడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పూర్తయిందని, ఈ రూట్‌లో రైళ్లు నడపాలని కోరారు. దీనివల్ల సమీప ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. అమృత్ భారత్ కింద నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికూడి, వినుకొండ, మాచర్ల రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం నరసరావుపేటలో పనులు ఆగిపోయాయని, రెండో నంబర్ ప్లాట్‌ఫాంలో సరైన వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మాచర్ల-గద్వాల్ రైల్వేలైన్ దశాబ్దాలుగా స్థానిక ప్రజలు కోరుతున్నారని వచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో 20 వరకూ ఆర్వోబీలు, ఆర్యూబీలు మంజూరు చేశారని, వాటికి టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయాలన్నారు.



సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

జిల్లాలో 255.8 మి.మీ. వర్షపాతం నమోదు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 255.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది మెట్ట పంటలకు జీవం పోసింది. జిల్లాలో అత్యధికంగా రెంటచింతలలో 38.2 మి.మీ. నమోదైంది. ఈపూరు 32.4 మి.మీ, శావల్యాపురం 31.8, బొల్లాపల్లి 28.4, వినుకొండ 23.4, మాచర్ల 23.6, పిడుగురాళ్ల 20.4, నరసరావుపేట 14.6, దుర్గి 16.2, వెల్దుర్తి 9.4, నూజండ్ల 9.2, రొంపిచర్ల 2.4 నమోదైంది.

గంజాయి మత్తు దిగాల్సిందే..

- కట్టడికి పోలీసుల పకడ్బందీ కార్యాచరణ
- కళాశాలల వద్ద విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా

❖ నరసరావుపేటకు చెందిన ఓ విద్యార్థికి ప్రతిష్ఠాత్మకైన ఎన్ఐటీ విద్యాసంస్థలో ఇంజినీరింగ్ సీటు వచ్చింది. కానీ ఆ యువకుడు గంజాయికి అలవాటు పడి చదువుకు దూరమై తల్లిదండ్రులకు వేదన మిగిల్చాడు.

❖ జిల్లాలో మారుమూల ప్రాంతం నుంచి యువకుడొకరు నరసరావుపేటలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో చేరాడు. రెండో సంవత్సరంలో గంజాయికి బానిసయ్యాడు. చదువుపై దృష్టి పెట్టలేకపోవడం. . కుటుంబ సభ్యులు పంపించే డబ్బును మత్తు పదార్థాలకు ఇష్టానుసారం వాడేశాడు. ఇప్పుడా ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.

వీరిద్దరే కాదు.. ఎంతోమంది యువత మత్తులో చిత్తవుతుంది. ప్రయోజకుడై తమను ఆదుకుంటాడని భావించే కుటుంబ సభ్యులకు తీరని వేదన మిగులుస్తున్నారు. గంజాయి కట్టడికి చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా దొరకడంతో యువత దీనికి బానిసలయ్యారు. దీన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి పూర్తిస్థాయిలో కట్టడికి చర్యలు చేపడుతున్నారు.

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

వైకాపా ప్రభుత్వ హయాంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఎక్కడ పడితే అక్కడ వాటి విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. యువత వాటికి బానిసలుగా మారి ఉజ్వల భవిష్యత్తును చేజేతులా కాలరాసుకున్న ఉదంతాలు అనేకం. నాడు వైకాపా నాయకులు, కార్యకర్తలు దీన్నో వ్యాపారంగా మలచుకున్నారు. మొత్తంగా యువత గంజాయి మత్తులో చిత్తయిపోయింది. కొందరు విద్యార్థులు కళాశాలలకు ఎగనామం పెట్టడంతో తల్లిదండ్రులకు పిల్లల భవిష్యత్తుపై బెంగపట్టుకుంది. ఈ పరిస్థితిని మార్చి అసలు గంజాయి విక్రయాలకు స్థానం లేకుండా చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సమాచారం అందిన వెంటనే దాడులు చేస్తూ నిందితులను రిమాండ్‌కు పంపుతున్నారు. తాజాగా జిల్లాకొకటి నార్కొటిక్స్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేయనున్నామని మంత్రి వర్గ ఉప సంఘం ప్రకటించిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో మత్తుపదార్థాల రవాణా, విక్రయాలకు అడ్డుకట్టకు చర్యలు తీసుకోనున్నారు. కళాశాలల్లో అవగాహన సదస్సులు పెట్టి విద్యార్థులను వాటికి దూరంగా ఉండాలని లేకపోతే భవిష్యత్తు అంధకారమవుతుందని హెచ్చరిస్తూ మార్పు తీసుకొచ్చే ప్రయత్నానికి పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో నరసరావుపేట, సత్తెనపల్లి, మాచర్ల కేంద్రాలుగా ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ కాలేజీలున్నాయి. ప్రస్తుతం ఈ కళాశాలల వద్ద నిఘా ఉండటంతో విక్రేతలు దరిదాపుల్లోకి రావడం లేదని తెలుస్తోంది.



జిల్లాలో రెండేళ్లలో..


మొత్తం కేసులు:	33
పట్టుపడ్డ గంజాయి:	230 కేజీలు
అరెస్టు అయినవారు:	98 మంది

గతంలో పట్టుబడినవారికి కౌన్సెలింగ్

గతంలో విక్రయాలు సాగించిన వారిని పోలీసు ఉన్నతాధికారులు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గంజాయి విక్రయాల నుంచి బయటపడాలని హెచ్చరించారు. అనుమానితులపై నిఘా వేస్తూ వారి కదలికలను గమనిస్తూ అరెస్టు చేస్తున్నారు. ఇది వరకు ఎక్కడి నుంచి ఎక్కడకు సరఫరా అవుతుందో తెలిసినా చర్యలుండేవి కావు. ఇప్పుడలా లేదు. జిల్లాలోకి గంజాయి వస్తుందనే సమాచారం రాగానే, వెంటనే పోలీసులు రంగంలోకి దిగి నిందితులను అరెస్టు చేసి కటకటాల్లోకి పంపిస్తున్నారు. నరసరావుపేట రెండో పట్టణ పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండటంతో ఒకేసారి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఇటీవల నాలుగు కేజీల గంజాయిని కూడా నరసరావుపేట రెండో పట్టణ పోలీసులే స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు పంపారు. కారంపూడి, పిడుగురాళ్ల.. ఇలా అన్ని స్టేషన్ల పరిధిలో గంజాయిని స్వాధీనం చేసుకుని గంజాయి విక్రేతలను జైళ్లకు పంపుతున్నారు.

పూర్తిస్థాయిలో కట్టడికి చర్యలు

హోం మంత్రి అనిత, డీజీపీ ద్వారక తిరుమలరావు ఆదేశాలతో జిల్లాలో గంజాయి నిషేధానికి చర్యలు చేపడుతున్నాం. మా సిబ్బంది దాడులు చేయడం.. తనిఖీలు చేపట్టడం వల్ల ఇటీవల జిల్లాలో గంజాయి పట్టుపడింది. విద్యార్థులను మత్తు పదార్థాల నుంచి దూరం చేయడానికి త్వరలో కార్యాచరణ మొదలుపెడతాం. కాలేజీల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం. నార్కోటిక్ కంట్రోల్ సెల్ వచ్చాక పూర్తిస్థాయిలో మత్తు పదార్థాల విక్రయాలకు అడ్డుకట్ట వేస్తాం. - కంచి శ్రీనివాసరావు, ఎస్పీ



సెలవుల్లో ఏం చేస్తున్నారో..!

- పిల్లలపై పర్యవేక్షణ తప్పనిసరి
- ప్రాణం తీస్తున్న ఈత సరదా

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

దసరా సెలవులు వచ్చాయంటే విద్యార్థుల ఆనందానికి అవధులుండవు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక ఎక్కువ రోజులు వచ్చే సెలవులివే కావడంతో ఎగిరి గంతేస్తారు. నాలుగు గోడలు.. చదివి.. ఒక్కసారిగా విరామం రావడంతో హాయిగా అమ్మమ్మ ఇంటికో.. సొంతూరో వెళ్లిపోయి సేద తీరతారు. అయితే జిల్లాలో ప్రస్తుతం చెరువులు, కాల్వలు, వాగులు అన్నీ నిండుకుండల్లా ఉన్నాయి. అన్నిట్లో నీరు పుష్కలంగా ఉంది. దీంతో సరదాగా ఈత కొడదామనో.. నీటిలో దిగుదామనో చేసే ప్రయత్నాలు తీరని కన్నీళ్లు మిగులుస్తాయి. అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలు నీటిలో కలిసిపోతాయి. తల్లిదండ్రులే ఓ కన్నేసి ఉంచాలి.

✷ గురజాలలో గ్రానైట్ తవ్వకాల్లో నీరు నిలిచింది. దసరా సెలవులు కావడంతో స్థానిక పిల్లలంతా కలిసి క్రికెట్ ఆడుకుంటుండగా.. బంతి గ్రానైట్ గుంతలో పడింది. లోతు తెలియక దిగిన ఇద్దరిలో ఒకరు మరణించారు.

✷ గత ఏడాది దసరా సెలవులకు అన్నా చెల్లెలు బాపట్ల జిల్లా నుంచి మాచర్లలోని అమ్మమ్మ ఇంటికి వచ్చారు. దగ్గరలో సాగర్ కుడికాల్వ ఉంది కాదా అని ఈత కొడదామని నీటిలోకి దిగిన అన్న కొట్టుకుపోయాడు.

నీటిని చూస్తే ఆరాటం

చాలామంది పిల్లలు అమ్మానాన్నలకు తెలియకుండా కాల్వలో ఈత కొడదామని స్నేహితులతో వెళ్లిపోతారు. అందులో ఒకరిద్దరికే ఈత వస్తుంది. మిగతావారికి రాకపోవచ్చు. అలాంటి సమయంలో ఏం కాదురా.. దిగు మేమున్నాం అని మిగతావారు బలవంతంగా దింపిస్తారు. నీటిని చూశాక మనసాగక ఈత రాకపోయినా లోతు తెలియక దిగిపోతారు. ఈ సమయంలోనే ప్రమాదాలు జరుగుతాయి. కాబట్టి తల్లిదండ్రులే ముందస్తుగా పిల్లల్ని హెచ్చరించాలి. కాల్వల వైపు వెళ్లకుండా చూసుకోవాలి. మరోవైపు కొందరు నీటిమధ్య పైనుంచో బ్రిడ్జిపై నుంచో సెల్ఫీలు దిగుతారు. అంచు ఎలా ఉందనేది గమనించరు. సెల్ఫీలు దిగే క్రమంలో కాలు జారి నీటిలో పడే ప్రమాదం పొంచి ఉంది.

ఈ పది రోజుల్లో పిల్లలు ఇంటిపట్టునే బుద్ధిగా ఉండేలా చేయడం కొంచెం కష్టమే. కానీ వారికి ఇష్టమైన పనుల్ని చేయిస్తూ ఇంటిపట్టునే ఉండేలా చేసుకోవచ్చు.

ఇలా చేస్తే..

✷ బడుల్లో ఎప్పుడూ పాఠాలు.. హోంవర్క్‌లతో పిల్లలు సతమతమవుతుంటారు. ఈ సెలవుల్లో వారిని పుస్తకాలకు దూరంగా ఉంచేలా చూడండి. డ్రాయింగ్ నేర్పించేలా ప్రోత్సహించండి. నచ్చిన బొమ్మల్ని ఎలా అయినా సరే వేయమనండి.. వేస్తున్న కొద్దీ ఆసక్తి పెరుగుతుంది. ఆదివారం ఆయా పత్రికలు ప్రచురించే అనుబంధ పుస్తకాల్లో పిల్లల కోసం ప్రత్యేక పేజీలుంటాయి. వాటిని చదివించేలా ప్రోత్సహించండి. అందులో అన్నీ పిల్లలకు సంబంధించినవే ఉంటాయి కాబట్టి వారికి విసుగు రాదు. నీతి కథ, దారి చూపడం.. సామెతలు, రంగులు వేయడం.. సరైన బొమ్మ కనిపెట్టడం లాంటివి ఉంటాయి. వీటిని చేయిస్తే మెల్లమెల్లగా పుస్తక పఠనం అలవాటు అయ్యే అవకాశం ఉంది. ✷ ఇంట్లో పెరటి తోట ఉంటే.. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో మొక్కలకు నీళ్లు పోయించండి. ఆ మొక్కల పేర్లు, వాటి ఉపయోగాలు తదితర అంశాలు నేర్పించండి. ఒక మొక్క నాటించి, రోజూ నీరు పోసి పెద్దదయ్యేలా చూసుకునే బాధ్యత అప్పగించండి. పిల్లలతో పాటు పెరుగుతూ మొక్క పెట్టుబడితే కొంతకాలానికి మీ పిల్లల్లో కనిపించే ఆనందమే వేరు. ✷ ఇంట్లో పాలు తాగిన గ్లాసును, టిఫిన్ ప్లేటును, భోజనం తిన్న పళ్లెన్ని వారే శుభ్రపరచుకునేలా ప్రేమతో చెప్పండి. అలవాటు క్రమంగా మంచి అలవాటుగా మారి ఎక్కువైనా తన పనుల్ని తానే చేసుకునేలా చూడండి.



ఇలా కాలువల్లో ఈతకెళితే జాగ్రత్త సుమా

న్యాయం చేయాలంటూ బాధితుల రాస్తారోకో

ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాదారుల కంటతడి ★ పరిశీలిస్తామన్న జడ్‌ఎం సందీప్ మెహ్రా



బ్యాంకు ముందు ఖాతాదారులు

చిలకలూరిపేట గ్రామీణ, పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో గత మేనేజర్ నరేష్ మోసానికి బ్యాంకు బాధ్యత వహించి బ్యాంకు అధికారులు న్యాయం చేయాలంటూ బాధితులు రోడ్డెక్కారు. బ్యాంకు ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో సమాచారం అందుకున్న అర్బన్ సీఐ వెళ్లి బాధితులకు సర్దిచెప్పి బ్యాంకు అధికారులతో మాట్లాడారు. బాధితులందరూ వివరాలు అధికారులకు అందించి దానికి తగిన పత్రం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ జోనల్ మేనేజర్ సందీప్ మెహ్రా మాట్లాడుతూ మోసపోయిన ఖాతాదారుల వివరాలన్నీ సేకరిస్తున్నామని, వీటిని పరిశీలించి.. పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు ఆర్బీఐకి కూడా ఫిర్యాదు చేసి ఖాతాదారులకు న్యాయం చేసేలా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నమ్మకంతో నయవంచన



మోసానికి పాల్పడిన గత బ్యాంకు మేనేజర్ నరేష్

ఐసీఐసీఐ బ్యాంకు చిలకలూరిపేట బ్రాంచి మేనేజర్‌గా డి.నరేష్ చంద్రశేఖర్ 2017 ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టారు. ఖాతాదారులు ఇక్కడ వెళ్లె వారితో మమేకమయ్యారు. అతన్ని నమ్మి శ్యాక డిపాజిట్ రూపంలో బ్యాంకులో వేసి బాండ్లు తీసుకున్నారు. ఆ సమయంలో సంతకాలు చేయించుకోవడం, వారి పోస్టు ఉపయోగించి బాండ్లపై ఓడీ పేరుతో నగదు మొత్తం తన ఖాతాకు జమ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నరేష్ నరసరావుపేటకు 2021 మేలో బదిలీ అయ్యారు. అక్కడ కూడా ఇలాగే మోసాలు చేశారు. 2023లో అక్కడి నుంచి విజయవాడకు బదిలీ అయ్యారు. నరేష్ మోసాలను గుర్తించిన ఐసీఐసీఐ బ్యాంకు ఉన్నతాధికారులు అతన్ని సస్పెండ్ చేశారు.

రూ.52 లక్షలు డిపాజిట్ చేశాను

నాతో పాటు కుటుంబ సభ్యుల పేరుతో రూ.52 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు 2001లో చేశాను. ఇటీవల వరకు వడ్డీ చెల్లించారు. అయితే నా పేరుతో ఉన్న ఎఫ్‌.డి.ల నుంచి గత మేనేజర్ నరేష్ ఓ.డి. తీసుకుని తన ఖాతాకు 90 శాతం నగదు బదిలీ చేసుకున్నారు. బ్యాంకు నుంచి పంపినట్లే వడ్డీ చెల్లించేవాడు. దీంతో అందరం నమ్మాం. కానీ ఇంత దారుణ మోసానికి పాల్పడతాడని ఊహించలేదు. -గోరంట్ల నరసింహారావు, మద్దిరాల గ్రామం

అందరి పాత్ర ఉంది..

మాది గోవిందపురం. చిలకలూరిపేటలో నివాసం ఉంటున్నాం. పిల్లల డబ్బులు రూ.95 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. బ్యాంకులో ఇలా జరిగిందని తెలిసి వచ్చి బాండ్లు పరిశీలన చేయిస్తే రూపాయి కూడా లేదని చెప్పారు. మా డబ్బులు ఎక్కడికో పోయాయి. బ్యాంకు సిబ్బంది, అధికారులకు తెలియకుండా ఎలా మోసం చేస్తారు. దీనిలో అందరి పాత్ర ఉంది.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం : కొమ్మాలపాటి

నరసరావుపేట అర్బన్ : రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తెలిపారు. ఇప్పటికే పలు హామీలను అమలు చేశారన్నారు. తాజాగా పట్టణ, గ్రామీణ ప్రజలకు ఊరట కల్పించేలా గత ప్రభుత్వం విధించిన చెత్తపన్నును రద్దు చేసినట్లు చెప్పారు. 2021లో చెత్తపన్ను విధించిన వైకాపా ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతను పట్టించుకోలేదని, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు బలవంత వసూళ్లకు పాల్పడ్డారని చెప్పారు. అందులో వైకాపా నేతలు అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు.

జిల్లా ఎస్‌ఈగా విజయ్‌కుమార్

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : పల్నాడు జిల్లా సర్కిల్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ఇంజనీర్‌గా ప్రత్తిపాటి విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

పశు పోషణకు ప్రత్యేక కమిషన్

ఔత్సాహికులకు రాయితీ ప్రోత్సాహం ✪ పశు సంవర్ధక శాఖ దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే



గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు పశుపోషణ ప్రధానమైంది. ఈ అసంఘటిత రంగాన్ని వ్యవస్థీకృతం చేసి పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తి పెంచడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగు పరిస్తే ఉపాధి అవకాశాలు పెరిగి గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం విశ్వసిస్తోంది. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ నిధులతో 2021-22 నుంచి 2025-26 సంవత్సరాల కాలపరిమితిలో యూనిట్లు ఏర్పాటు చేసిన ఔత్సాహికులకు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలివే.. ✫ దేశీయ కోళ్లకు- వెయ్యి పెరటి కోళ్లు, కోడి పిల్లల ఉత్పత్తి, పొదుగు కోళ్ల యూనిట్‌కు రూ.50 లక్షలు, అంతకు మించి పెట్టుబడి అయితే గరిష్ఠంగా రూ.25 లక్షలు రాయితీ ఇస్తారు.

గొర్రెలు, మేకల పెంపకంపై..

యూనిట్ స్థాయి ఆడ	యూనిట్ స్థాయి మగ	రాయితీ (ప్రాజెక్టు వ్యయంలో సగం)
100	5	10
200	10	20
300	15	30
400	20	40
500	25	50
		రూ.లక్షలు

పందుల పెంపకం : పందుల పెంపకంలో 50 ఆడ, ఐదు మగ లేదా 100 ఆడ, 10 మగ పందులతో కూడిన యూనిట్‌కు రూ.30-60 లక్షలు పెట్టుబడి అయితే రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలు రాయితీ మంజూరు చేస్తారు.

పశుగ్రాసం, దాణా అభివృద్ధికి : సైలేజీ, గ్రాసం దిమ్మెలు, సమీకృత దాణా తయారీ యూనిట్లకు పెట్టుబడి రూ.కోటి అంతకు మించితే రూ.గరిష్ఠంగా రూ.50 లక్షలు రాయితీ ఇస్తారు.

ఎంపిక ఇలా..

ఈ దేశ పౌరులై ఉండాలి. ఒకరు లేదా ఇద్దరు కలిసి ఏర్పాటు చేసినా.. లేదా సంఘాలు, కంపెనీల ద్వారా ఏర్పాటు చేయొచ్చు. వయస్సు 65 ఏళ్ల లోపు ఉండాలి. సొంతంగా లేదా అద్దెకు తీసుకున్న భూమి కావాలి. జీవాల పెంపకంలో అనుభవం ఉండాలి. నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టు నివేదిక పోర్టల్లో అప్‌లోడ్ చేయాలి. రాయితీ పోనూ మిగిలిన పెట్టుబడి కోసం రుణం పొందడానికి బ్యాంకు అనుమతి పొందాలి.

యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు



జాతీయ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) పథకం అమలు పర్యవేక్షణకు జిల్లా నోడల్ అధికారిగా డాక్టర్ సీహెచ్ కోటిరత్నంను నియమించారు. యూనిట్లు ఏర్పాటు చేసుకొని వివరాలను పశు సంవర్ధక శాఖ సూచించిన పోర్టల్లో అప్‌లోడ్ చేసి రాయితీ పొందొచ్చు. .

–కె.కాంతారావు, పశు సంవర్ధకశాఖాధికారి, పల్నాడు జిల్లా

కుష్ఠు నివారణపై వైద్యాధికారులకు శిక్షణ తరగతులు



శిక్షణకు హాజరైన అధికారులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ కుష్ఠు, క్షయ నివారణ పథకంపై వైద్యాధికారులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. నరసరావుపేట, సత్తెనపల్లి డివిజన్ల అధికారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యాధుల ముందస్తు గుర్తింపు, చికిత్స తదితర అంశాలు వివరించారు. శనివారం గురజాల డివిజన్ వైద్యాధికారులకు శిక్షణ తరగతులు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, డీఐవో గీతాంజలి, జిల్లా కుష్ఠు నివారణ విభాగం అధికారి డాక్టర్ మురళీకృష్ణ ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాలకు దరఖాస్తులు

నరసరావుపేట అర్బన్ : జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధు ఉపకరణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారి సువార్త తెలిపారు. రేషన్‌కార్డు, సదరం ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో అక్టోబరు 1 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌ల కోసం స్టడీ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తుదారుల అర్హత, లభ్యత ఆధారంగా మంజూరు ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో www.apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆర్థిక రుణసంస్థల వేధింపులు ఆపాలి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : ఆర్థిక రుణసంస్థల వద్ద వాహనాల కొనుగోలుకు అప్పులు తీసుకుని సకాలంలో చెల్లిస్తున్నా ఎప్పుడైనా ఆలస్యమైతే వారి నుంచి వేధింపులు అధికమవుతున్నాయని మినీ లారీ డ్రైవర్లు, యజమానుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏనుగుపాలేనికి చెందిన కల్యాణ్ ఆటో కొనేందుకు రుణం తీసుకుని రెండు వాయిదాలు చెల్లించకపోగా సంస్థ సిబ్బంది డబ్బులు చెల్లించకపోతే గ్రామానికి వచ్చి పంచాయతీ పెడతామని బెదిరించగా అతను ఆత్మహత్యాయత్నం చేసినట్లు చెప్పారు. వాహన డ్రైవర్లు, యజమానులు ప్రదర్శనగా ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అక్కడ సీఐ లేకపోగా వెనుతిరిగారు.

విద్యుదాఘాతంతో బేల్దారి కూలీ మృతి

చిలకలూరిపేట పట్టణం : విద్యుదాఘాతంతో పట్టణంలో బేల్దారి కూలీ మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని మేదరు బజారులో శుక్రవారం ఒక ఇంటి మరమ్మతులు చేసేందుకు పట్టణానికి చెందిన పి.ఇమ్మానియేలు (48) వచ్చాడు. ప్రమాదవశాత్తు విద్యుత్తు స్తంభానికి ఉన్న తీగ తగిలి షాక్‌తో కిందపడ్డాడు. ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'మద్యం దుకాణాలకు 60 దరఖాస్తులు'

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని 129 మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం శుక్రవారం మధ్యాహ్నానికి 60 దరఖాస్తులు వచ్చినట్లు అబ్కారీ శాఖ ఈఎస్ మణికంఠ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ఆంధ్ర అబ్బాయి.. జర్మనీ అమ్మాయి

పెళ్లితో ఒక్కటైన జంట



వివాహ వేడుకలో శివప్రసాద్, లియోని

మొక్కపాడు(రాజుపాలెం), న్యూస్‌టుడే: వారి ప్రేమ ఖండాలను దాటి పెళ్లితో ఒక్కటైంది. రాజుపాలెం మండలం మొక్కపాడు గ్రామానికి చెందిన పశ్యావుల లక్ష్మయ్య, నరసమ్మ కుమారుడు శివప్రసాద్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ కోసం ఇటలీ వెళ్లాడు. అక్కడే ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా జర్మన్ భాష నేర్చుకునే క్రమంలో 2022లో హెలెన్ లియోనితో పరిచయం ఏర్పడింది. రెండేళ్లుగా వీరి మధ్య ప్రేమ కొనసాగింది. వారికి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించారు. దీంతో హిందూ సంప్రదాయం ప్రకారం మొక్కపాడులో శుక్రవారం రాత్రి వారి వివాహం జరిగింది. గ్రామస్థులందరూ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

వైకాపా నేతల ఇళ్లలో మారణాయుధాలు

మల్లాదిలో వెలుగులోకి..



దొరికిన ఆయుధాలను పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతురావు తదితరులు

అమరావతి: ఎన్డీఏ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మల్లాదిలో వైకాపా నేతలు తరచూ తెదేపా శ్రేణులను కవ్విస్తూ అలజడులు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. తెదేపా ఫ్లెక్సీలు చించి వేయడం, తెదేపా నేతలపై దాడులకు పాల్పడుతున్నారు. దీంతో డీఎస్పీ హనుమంతురావు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు గ్రామంలో కార్డన్ సర్చ్ నిర్వహించారు. వైకాపా నేతల ఇళ్లలో పలు మారణాయుధాలు గుర్తించారు. తెల్లవారుజామున 4 నుంచే సోదాలు చేశారు. బరిసెలు 4, పొడవాటి కత్తులు 2, చిన్నకత్తి 1, కొడవలి 1, పలుగు 1, గొడ్డళ్లు 19, రాళ్ల మూట, పత్రాలులేని 6 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అలజడులు సృష్టించి గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. కార్డన్ సర్చ్‌లో 70 మంది పోలీసులు పాల్గొన్నారు.

అసభ్య పోస్టులు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలి

చిలకలూరిపేట పట్టణం : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమార్తెలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వైకాపా సామాజిక మాధ్యమాల కార్యకర్త పెద్దిరెడ్డి సుధారాణిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ కోరారు. ఈ మేరకు పట్టణ సీఐ రమేష్‌ను శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

పోలీసుల్ని ఆశ్రయించిన ప్రేమజంట


మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట) : నరసరావుపేట రెండో పట్టణ పరిధికి చెందిన ఓ ప్రేమజంట శుక్రవారం వివాహం చేసుకుని పట్టణ పోలీసుల్ని ఆశ్రయించింది. ఇద్దరూ మేజర్లు కావడంతో ఎస్సై అశోక్ వారికి సర్ది చెప్పి పంపారు.

మరో గబ్బిలం పుస్తకావిష్కరణ

చిలకలూరిపేట పట్టణం : స్థానిక పించనుదారుల సంఘ భవనంలో గంగవరపు సునీత రచించిన 'మరో గబ్బిలం' కవితా సంపుటిని సాహితీ విమర్శకులు, కవులు శుక్రవారం ప్రారంభించారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చెక్కు అందజేస్తున్న రైతు రామయ్య

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

నూజండ్ల, న్యూస్‌టుడే : వరద బాధితుల సహాయార్థం నూజండ్ల మండలం కొత్తనాగిరెడ్డిపల్లెకు చెందిన రైతు లేళ్ల రామయ్య శాసనసభ్యులతో కలిసి శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి రూ.లక్ష విరాళం అందజేశారు. డీఎల్‌డీఏ ఛైర్మన్ లగడపాటి వెంకట్రావు, ముంద్రు సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితర నాయకులున్నారు.

కోతకు గురైన ఘాట్‌రోడ్

వినుకొండ, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిర్మాణంలో ఉన్న వినుకొండ కొండఘాట్ రోడ్డు కోతకు గురైంది. అంచులు విరిగి రాళ్లు రహదారిలో పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏడాది నుంచి నిర్మాణ పనులు నిలిచాయి. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రహదారి పనులు పునః ప్రారంభిస్తామని తెలిపారు.



కోతకు గురైన ఘాట్ రోడ్డు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? సర్వసతి శిశుమందిర్ నుంచి బైపాస్ వెళ్లే రోడ్డులో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయండి. **-శివశంకర్**

✔ అధికారులను పంపి చర్యలు తీసుకుంటాం.

- జస్వంతరావు, కమిషనర్

? పెదచెరువు బైపాస్ రోడ్డు గోగుల సీతారామయ్య నగర్‌లో వ్యర్థాలు తొలగించడం లేదు. **- వెంకట్**

✔ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం.

- రామకోటయ్య శానిటరీ ఇన్‌స్పెక్టర్

- న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

వినుకొండలో మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

వినుకొండ, న్యూస్‌టుడే : వినుకొండలో మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే తన తల్లి పేరు మీద స్థలంతో పాటు నిర్మాణ వ్యయంలో 25 శాతం ఖర్చు భరిస్తానని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈమేరకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో ఆయన కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన స్వగ్రామం ఇనిమెళ్లలో తన తండ్రి పేరుతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థలం ఇచ్చామని, ఇప్పుడు అదనపు తరగతి గదులు అవసరం ఉన్నందున వాటిని మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ఆట వస్తువుల కోసం రూ.15 లక్షల విరాళం ఇస్తానని మంత్రికి చెప్పినట్లు వివరించారు.

శ్మశానానికి వెళ్లాలంటే వాగు దాటాల్సిందే

రొంపిచర్ల, న్యూస్‌టుడే : మండలంలోని అలవాల గ్రామస్థులు శ్మశానానికి వెళ్లాలంటే వాగు దాటాలి. గ్రామంలో హిందువులు, ఎస్సీలు తదితరుల శ్మశానవాటికలు వాగు అవతల ఉండటంతో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని శ్మశానానికి తీసుకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో వాగులో నీటి ప్రవాహం అధికంగా ఉంటుంది. వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అలవాలలో వాగు అవతల ఉన్న శ్మశానం

బోధనలో వైవిధ్యం

విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్న గురువులు

నేడు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం

వినుకొండ, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

అంకితభావంతో ఒకరు.. బోధనలో వైవిధ్యం ప్రదర్శిస్తుం దొకరు.. విద్యపట్ల వారి సేవలు ప్రశంసనీయం. పేద పిల్లలకు చిన్న వయసులో చక్కని మార్గదర్శకం చేస్తూ గురువు పేరును సార్థకం చేసుకున్నారు. ఇంతకి వారెవరు.. అందించిన సేవల గురించి 'ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం' సందర్భంగా తెలుసుకుందాం..

గణితంలో ఘటికుడు



వేణుగోపాలరావును సన్మానిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

పోతిన వేణుగోపాలరావు మాస్టార్ ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పీజీటీగా ఉద్యోగంలో చేరి గణిత ఉపాధ్యాయుడిగా బోధనలో గుర్తింపు తెచ్చుకున్నారు. 2005 నుంచి 2016 వరకు సుమారు 11 ఏళ్లు పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. తర్వాత వినుకొండ పాఠశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి పక్కా భవనాల నిర్మాణానికి కృషి చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న కారంపూడి పాఠశాల విద్యార్థి ఈశ్వర్‌నాయక్ గత సంవత్సరం పదో తరగతిలో జిల్లా స్థాయిలోని అన్ని గురుకులాల్లో ప్రథమునిగా నిలిచాడు. ఆయన ఇప్పటి వరకు అనేక ప్రశంసాపత్రాలు అందుకున్నారు. 2013, 2014, 2015 మూడుసార్లు ఐటీడీఏ సీతంపేట నుంచి ఈ ఏడాది పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. సైన్స్ ఫెయిర్‌లో ఆయనది ఆదే జోష్. 2019లో వినుకొండ పాఠశాల బాలిక దుర్గాబాయి రాష్ట్రంలో సైన్స్ ప్రదర్శనలో ప్రథమ స్థానంలో నిలవగా 2011, 2012, 2015లో సీతంపేట ఐటీడీఏ, శ్రీకాకుళంలో ఉత్తమ ప్రదర్శన కింద ప్రశంస పత్రాలు అందుకున్నారు. 2020లో నిర్వహించిన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రవేశ పరీక్షలో ఆయన ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న వినుకొండకు చెందిన బాలికలు తొమ్మిది మందికి ఎనిమిది మంది 50లోపు ర్యాంకులు సాధించారు. ఇలా ఆయన పనిచేసిన ప్రతి చోటా ఏదో ఒక గుర్తింపు సాధించి ప్రత్యేకత చాటుతున్నారు.

ఆంగ్ల అవలీలగా



విద్యార్థులకు ఆంగ్ల భాషపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయిని శైలజారాణి

ఆంగ్లభాష అంటే పిల్లలకు తెలియని భయం.. కానీ ఈ ఉపాధ్యాయిని భాషపై ప్రతి విద్యార్థి పట్టు సాధించేలా తీర్చిదిద్దుతూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఆమె బి.ఎన్. శైలజారాణి. ప్రస్తుతం గణపవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఆంగ్లభాష చేతిరాతలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ముత్యాల్లా రాసేలా తీర్చిదిద్దుతున్నారు. గతంలో మాచవరం మండలం మోర్జంపాడు, సత్తెనపల్లి మండలం పెదమక్కెన జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి అక్కడి విద్యార్థులు ఆంగ్లభాషలో మాట్లాడేలా శిక్షణ ఇచ్చారు. జిల్లా అధికారులు 2024 ఉత్తమ ఉపాధ్యాయినిగా ఆమెకు అవార్డు అందజేశారు.

బాలస్వామికి భలే క్రేజ్..



బి.బాలస్వామి

బొల్లినేని బాలస్వామి మాస్టార్‌కు బోధనలో 37 ఏళ్ల అనుభవం. బడి తప్ప మరో ధ్యాస లేని ఆయన వద్ద చదువుకున్నది అంతా పేద పిల్లలే. ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాల కొండ్రముట్లపాలెంలో సుదీర్ఘ కాలం 27 ఏళ్ల పని చేశారు. సుమారు 800 మంది ప్రత్యేక శిక్షణ ద్వారా వివిధ ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో సీట్లు పొందారు. నాడు ఆయన వద్ద చదువుకున్న పిల్లల్లో ఆ ఒక్క గ్రామంలోనే 40 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఉన్నారంటే ఆశ్చర్యం కలగమానదు. ప్రస్తుతం పనిచేస్తున్న జాలలపాలెంలో చెందిన 15 మంది పేరున్న గురుకులాల్లో ప్రవేశాలు పొందారు. గణితం సులభ పద్ధతిలో బోధన చేయడం ఆయన ప్రత్యేకత. నాలుగో తరగతి విద్యార్థులు ముగ్గురు రెండు నుంచి మూడు వేల ఆంగ్ల పదాలు స్పెల్లింగులు ఒకటిగా చెప్పేస్తారు. ఇంటర్ స్థాయిలో నేర్చుకునే పిరియాడిక్ టేబుల్, ఆటమిక్‌మాస్, కెమికల్ ఫార్ములాలు, వైజ్ఞానిక గురించి ప్రాథమిక విద్యలోనే తర్ఫీదు ఇస్తున్నారు. అందుకే బాలస్వామి మాస్టార్ అంటే పిల్లల్లో భలే క్రేజ్ అని చెబుతారు.

అంకితభావం ఆయన నైజం



విద్యార్థులకు బోధన చేస్తున్న షేక్ అబ్దుల్ ఖాదర్

కాపూరు జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు షేక్ అబ్దుల్ ఖాదర్ విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే పుస్తకాలు రచన చేశారు. ఆయన రాసినవాటిలో ప్రైవేటు స్కూల్స్ టీచర్ల ఇబ్బందులు, స్కూలు ఎడ్యుకేషన్ ఇండియా, పదో తరగతి విజయ సోపానం ఉన్నాయి. పదో తరగతి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సరళభాషలో గ్రామర్, ప్యాసేజెస్ ఇచ్చి విజయ సోపానం తయారు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ప్రభుత్వ విద్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పుస్తకాల్లోనూ ఆయన ప్రముఖపాత్ర పోషించారు. హిందీలో వంద పద్యాల శతక రచన కూడా చేశారు.

2018లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. కొవిడ్ సమయంలో డీడీ సప్తగిరి ఛానల్ ద్వారా విద్యామృతం కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. 2022లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేసింది.

శాంతి ఆశ్రమంలో పూజలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : విఠంరాజుపల్లిలోని శాంతి ఆశ్రమం వద్ద హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో రెండోరోజు శుక్రవారం రాజశ్యామల యాగం, కుంకుమ పూజ, 108 శ్రీచక్ర కలశ స్థాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. శివునికి, శివలింగాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురూజీ తొమ్మిది రోజులు మౌనదీక్షలో ఉంటారని ట్రస్టు సభ్యులు తెలిపారు.

ప్రమాదపుటంచున ఓగేరు వంతెన



ఓగేరు వంతెనపై దెబ్బతిన్న రెయిలింగ్ (సర్కిల్)లో

మండలంలోని పెట్లూరివారిపాలెం సమీపంలో ఉన్న ఓగేరు వాగు వంతెన ప్రమాదపుటంచుకు చేరింది. ఇటీవల పలు ప్రమాదాలు జరిగి దీనికి ఇరువైపులా రెయిలింగ్ ధ్వంసమైంది. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రెయిలింగ్‌కు మరమ్మతులు చేయించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

చట్టాలపై అవగాహన తప్పనిసరి

శావల్యాపురం, న్యూస్‌టుడే : చట్టాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని శావల్యాపురం ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కనమర్లపూడి కూడలి వద్ద గ్రామస్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని సూచించారు. చిన్నారులకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. ఎస్‌బీ కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది ఇమ్రాన్ ఉన్నారు.

7 నుంచి ఉచిత యోగ శిక్షణ తరగతులు

నరసరావుపేట అర్బన్ : శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో 7 నుంచి ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ తెలిపారు. పట్టాభి రామస్వామి ఆలయంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఉదయం 5 నుంచి 7 వరకు 28 రోజుల పాటు తరగతులు నిర్వహిస్తారన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు

నరసరావుపేట సెంట్రల్ : వైద్యశాలకు వచ్చే రోగులకు సకాలంలో సేవలు అందించాలని, నిర్లక్ష్యం వహించరాదని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయాధికారి మురళీ సూచించారు. శుక్రవారం మండలంలోని కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసేవల కోసం వచ్చిన రోగులను సేవలు సకాలంలో అందుతున్నాయా, మందుబిళ్లలు ఇస్తున్నారా, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వైద్యురాలు మమతప్రియ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం చిన్నతురకపాలెం సచివాలయాన్ని సందర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థకు చంద్రబాబు కొత్తరూపు



నూతనంగా బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : అయిదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి షెడ్డుకు చేర్చిన ప్రజా రవాణా వ్యవస్థను ప్రజా ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నూతనంగా మారుస్తున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హర్షం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట డిపోలో శుక్రవారం నాలుగు నూతన బస్సులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఎస్-6 బస్సులను ఒక్కొక్కటి రూ. కోటి విలువ చేసే ఇంద్ర బస్సులు రెండింటిని చిలకలూరిపేట డిపోలో ప్రారంభించినట్లు చెప్పారు. డీఎం రాంబాబు, ఆర్టీసీ డిపో అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మంచి పంట రకాలు ఎంచుకుంటే లాభాలు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : వరిలో మంచి పంట రకాలు ఎంచుకొని సాగుచేస్తే లాభాలు గడించవచ్చని డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని ఇక్కుర్రులో శుక్రవారం రాష్ట్రీయ కిసాన్ యోజన ఆధ్వర్యంలో రైతులకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన శివకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ క్రాప్ చేయించుకోవాలని కోరారు. పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. పంటలకు జీవన, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలని సూచించారు. ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు, వీఏఏ పావని, రైతులు పాల్గొన్నారు.



పాతూరు భీమలింగేశ్వరాలయంలో కౌమారిగా పార్వతి అమ్మవారు



నూజండ్ల : జడ్డావారి పాలెంలో గాయత్రీదేవిగా..



గంటావారిపాలెంలో గాయత్రీ దేవిగా ..



రామిరెడ్డిపేటలో బాల చౌడేశ్వరికి ప్రత్యేక అలంకరణ



బోయపాలెంలో..

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : దేవీ శరన్నవ రాత్రుల వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. రెండో రోజు ఆలయాల్లో అమ్మవారు కౌమారిగా, గాయత్రిగా, వైష్ణవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా బాలపూజ, గోపూజ, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. పాతూరు, బరంపేట, రామిరెడ్డిపేట, అరండల్‌పేట, వాసవీ కన్యకా పరమేశ్వరి, శంకరమఠంలో ప్రత్యేక కార్యక్రమాలు సాగాయి.

నూజండ్ల : మండలంలోని రవ్వారం శ్రీవెంకటేశ్వర జగన్నాత పీఠంలో దేవి శరన్నవ రాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు లక్ష్మీదేవిగా, జడ్డావారిపాలెం నీలంపాటి లక్ష్మి అమ్మవారు, రౌద్రుల అంకమ్మ తల్లి దేవాలయంలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

వినుకొండ రూరల్ : విఠంరాజుపల్లిలోని శాంతి ఆశ్రమం వద్ద రెండో రోజు అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

శావల్యాపురం : గంటావారిపాలెం శ్రీ లక్ష్మీతిరుపతమ్మ, శావల్యాపురం శ్రీ కనకదుర్గమ్మ, శ్రీనిదానంపాటి లక్ష్మీ అమ్మవారికి అలంకారాలు చేశారు.



వినుకొండ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



రొంపిచర్ల : గాయత్రీదేవిగా విప్పర్ల కామాక్షి అమ్మవారు



పసుమర్రులో ఆదిలక్ష్మిగా..



చిలకలూరిపేట : దాసరికాలనీ కనకదుర్గ ఆలయంలో..

పంచాయతీరాజ్ శాఖ డీఈగా ముత్తయ్య

నరసరావుపేట టౌన్ : పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం డీఈగా కుంబా ముత్తయ్య నియమితులయ్యారు. గురజాల నుంచి బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం విధుల్లో చేరారు. నరసరావుపేట మండల పీఆర్ ఏఈగా పనిచేస్తూ.. డీఈ అదనపు బాధ్యతలు పర్యవేక్షించిన హరినాథ్‌ను బాపట్ల జిల్లా చీరాలకు బదిలీ చేశారు. వినుకొండ (పీఐయూ) నుంచి వచ్చిన పి. వెంకట్రావు ఏఈగా నియమితులయ్యారు.

ఈపూరు ఎంపీడీవోగా ప్రభాకరరావు

ఈపూరు : ఈపూరు ఎంపీడీవోగా కుంచెం ప్రభాకరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రంగనాయకులు బదిలీపై ప్రకాశం జిల్లా వెళ్లగా.. మేడికొండూరు నుంచి ప్రభాకరరావు వచ్చారు.

సర్వేయర్‌గా ప్రసాద్

చిలకలూరిపేట గ్రామీణ : చిలకలూరిపేట మండల సర్వేయర్‌గా యద్దనపూడి ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పెదనందిపాడు నుంచి ఆయన వచ్చారు. ఏపీఎంగా గుదే రాజారత్నం శుక్రవారం బాపట్ల జిల్లా మార్టూరు నుంచి చిలకలూరిపేటకు వచ్చారు.

రొంపిచర్ల ఆర్ఐగా కోటేశ్వరరావు

రొంపిచర్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పి.కోటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఈపూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఉచిత ఇసుక విధానాన్ని సమర్థంగా నిర్వహించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో ఇసుక ఉచితంగా ఇచ్చే విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లాలోని అన్ని రీచ్‌ల నుంచి ఇసుక సేకరించి వినియోగదారులకు గత ప్రభుత్వం కంటే తక్కువ ధరకు ఇవ్వాలన్నారు. ఇసుకపై జీఎస్టీ విధింపు సరి కాదన్నారు. నేతలు శిలార్ మసూద్, శివకుమారి, కామినేని రామారావు తదితరులు ఉన్నారు.

వినుకొండ : ఎన్నికల హామీ మేరకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. హనుమంతరెడ్డి, కె. శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

యడ్లపాడు : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంస్థ అధ్యక్షుడు రామిశెట్టి అంజి, ప్రధాన కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు

మండల విద్యా వనరుల కేంద్రం తనిఖీ

చిలకలూరిపేట గ్రామీణ : చిలకలూరిపేటలోని మండల విద్యా వనరుల కేంద్రాన్ని డీఈవో ఎం. వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలల్లో యూడైస్ వర్క్ ప్రొగ్రెస్, మన బడి .. మన భవిష్యత్తు కార్యక్రమ పనితీరు, సేఫ్టీ ఆడిట్ వివరాలు తెలుసుకున్నారు. పలు రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. అన్ని అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు. అందరూ తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ఎంఈవో లక్ష్మి ఉన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

వినుకొండ రూరల్ : ప్రతి కార్డుదారుడికి రేషన్ సకాలంలో అందించాలని.. ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేష్ రేషన్ డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లి, తిమ్మాయిపాలెంలో రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.

ఈ-కేవైసీ నమోదు చేయించండి

నూజండ్ల : ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ- కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుగుణా బేగం అన్నారు. శుక్రవారం నూజండ్లలోని రైతు సేవా కేంద్రంలో చేపట్టిన ఈ-కేవైసీ, ఈ- పంట నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి

రొంపిచర్ల : రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఆరేపల్లి సచివాలయాన్ని శుక్రవారం మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి కె.సూర్యప్రకాశ్‌రెడ్డి తనిఖీ చేశారు. రొంపిచర్ల పీహెచ్‌సీలో సదుపాయాలపై ఆరా తీశారు.

విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ ఒప్పంద కార్మికుల ఆందోళన

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : రాజకీయ ఒత్తిడి కారణంగా తమను విధుల నుంచి తొలగించి రెండు నెలలుగా జీతాలు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పొరుగు సేవల ఇంజనీరింగ్ ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో సుమారు 150 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, వీరిలో సుమారు 30 మందిని రెండు నెలలుగా విధుల్లోకి రావద్దని చెప్పి జీతాలు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. జీతాలు రాక.. కుటుంబం గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అదేమని అడిగితే ఎమ్మెల్యేను కలిసి రావాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లోకి తీసుకోకుంటే ప్రజా సంఘాల మద్దతుతో ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇసుక వాగును ఇరుకుగా చేశారు

వినుకొండ, న్యూస్‌టుడే

వాగైనా, నీళ్ల ట్యాంక్ అయినా కలిపేసుకునేందుకు వెనుకాడటం లేదు. వినుకొండ పట్టణంలో ఇదే చోటు చేసుకుంది. పాత పట్టణంలో వానతో పాటు వాడుకున్న నీరు ప్రవహించే ఇసుక వాగు కుచించుకుపోతోంది. కొంత మంది ప్రవాహ దిశను మళ్లించి నేల చదును చేసి కట్టడాలు నిర్మించారు. కొండపై కురిసిన వాన నీరు అప్పయ్యకుంట నుంచి కోటనాల్సా బజారు మీదుగా ఇసుక వాగులో కలుస్తుంది. నరగాయకుంట మార్గం నుంచి వచ్చే వృథా నీరంతా డబ్బా స్తంభం సెంటర్ మీదుగా ఇందులోనే చేరుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే పాత పట్టణానికి కీలకమైన ఈ వాగు ఇప్పుడు కుచించుకుపోయింది. పెద్ద బోరింగ్ సెంటర్ నుంచి మార్కాపురం రోడ్డు వరకు వెడల్పు తగ్గి సామర్థ్యం తగ్గిపోగా అక్కడి నుంచి రైలు ట్రాక్ వంతెన వరకు వాగు దిశను మార్చి చదును చేసి కొందరు స్థలాల్లో షెడ్లు నిర్మించారు. దీంతో వాన నీరు పట్టక వెనక్కి తన్ని పాత మార్కెట్ వద్ద రహదారిపైన భారీగా నీరు నిలుస్తోంది. ఇసుకవాగు బజారులో ఇరుపక్కల ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. బుడమేరు కబ్జాలతోనే విజయవాడ మునిగిందని ఇప్పటికి గ్రహించారు. అలాగే ఇసుకవాగు సర్వే చేసి హద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



వెడల్పు తగ్గిన ఇసుక వాగు

మంచినీళ్ల ట్యాంకు మాయమైంది

సురేష్‌మహల్ రోడ్డులో నాడు పంచాయతీ నిర్మించిన మంచినీళ్ల ట్యాంక్, బోరు, మోటారు షెడ్డు మాయమయ్యాయి. వాటి వెనుక స్థలం కొన్న ప్రైవేటు వ్యక్తులు ఈ నిర్మాణాలు తొలగించి అందులో కలిపేసుకున్నారు. వాణిజ్య దుకాణాలు నిర్మించి పక్కనున్న దారికి కటకటాలు పెట్టారు. పాలనా యంత్రాంగం మెతక వైఖరిని ఆక్రమార్కులు అలుసుగా తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : దివ్యాంగుల ఐపీఎల్ టీ- 20 క్రికెట్‌కు ఎంపికైన మండలంలోని బొప్పూడికి చెందిన ఎస్. వేణును తెదేపా మండల అధ్యక్షుడు జవ్వాజి మదన్, పార్టీ గ్రామ అధ్యక్షుడు గుంటు కోటేశ్వరరావు శుక్రవారం అభినందించి.. రూ.10 వేల సాయం చేశారు.

స్వరూపరాణికి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు

నాదెండ్ల : నాదెండ్ల ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా స్వరూపరాణి శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ స్థానంలో నియమితులైన పద్మారాణి ఒక రోజు వ్యవధిలోనే వలసపై వెళ్లారు. అచ్చంపేట నుంచి ఇటీవల బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ స్వరూప రాణికి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

జూదరుల అరెస్టు

నరసరావుపేట సెంట్రల్ : మండలంలోని యల్లమంద పంచాయతీ చీకటికాలనీలో శుక్రవారం తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేసి రూ.1,00,800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిశోర్ తెలిపారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

చెన్నై బస్సు సర్వీసు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్ల నుంచి చెన్నైకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. తొలుత బస్సుకు ఆయుధ పూజ చేశారు. డిపో మేనేజర్ పిచ్చయ్య నేతృత్వంలో ఎమ్మెల్యే బస్సును నడిపి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నరసింహారావు, దుర్గారావు, మదార్‌సాహెబ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ప్రతినిధులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో నడికుడి దుర్గ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునశర్మ తెలిపారు. పెనుమాక గ్రామంలో జరిగిన పోటీల్లో అండర్-14, 17 విభాగంలో విద్యార్థులు 2, 3 స్థానాల్లో నిలిచారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? కొన్ని రోజులుగా దాచేపల్లి పోలీస్ స్టేషన్ పక్క వీధిలో పైపు లైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. - **శ్రీనివాసరావు, స్థానికుడు**

✔ పరిశీలించి పైపులకు మరమ్మతులు చేయిస్తాం.
- నగర పంచాయతీ కమిషనర్, – న్యూస్‌టుడే, దాచేపల్లి

? పట్టణంలోని కళ్లం టౌన్ షిప్ ప్రాంతంలో అక్కడక్కడ వీధి దీపాలు వెలగటం లేదు. **- రమణారావు**

✔ సిబ్బందిని పంపి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
- రాఘవేంద్ర, మున్సిపల్ ఏఈ, – న్యూస్‌టుడే, పిడుగురాళ్ల

? అంజనాపురంలోని తాగునీటి ట్యాంకులోని నీరు దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

✔ తాగునీటి ట్యాంకును శుభ్రం చేస్తాం.
- నాగేశ్వరరావు, ఏఈ, గురజాల, – న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

బెల్లం ఊట ధ్వంసం

వెల్దుర్తి: రామచంద్రాపురం తండా అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. పది లీటర్ల సారా, డ్రమ్ముల్లో నిల్వవున్న బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వ్యాధి నిర్ధారించాలంటే.. ప్రైవేటు ల్యాబ్‌కు వెళ్లాల్సిందే

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్లక్ష్యం

దాచేపల్లి, న్యూస్‌టుడే

కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగీ, గన్యాతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అయితే వ్యాధిని నిర్ధారించేందుకు అవసరమైన పరికరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రూ.వేలు ఖర్చు చేసి ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తోంది. దాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) యంత్రాలు వినియోగంలో లేవు. ఈ ఆసుపత్రికి నిత్యం 150 నుంచి 200 మంది రోగులు వస్తున్నారు. అందులో డెంగీ, గన్యా బాధితులు ఉన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూలనపడిన సీబీపీ యంత్రం

రక్త పరీక్షలకు రూ.2,500పైగా ఖర్చు

గతంలో దాచేపల్లి పీహెచ్‌సీలో రక్త నమూనాలు సేకరించి, అప్పటికప్పుడే రోగ నిర్ధారణ ఫలితాలు వెల్లడించేవారు. పరీక్షలకు సంబంధించి రసాయనాలు లేకపోవడంతో సీబీపీ యంత్రాన్ని మూలన పెట్టారు. దీంతో వైద్యులు ఆసుపత్రికి వచ్చే బాధితులకు చీటీ రాసిచ్చి ప్రైవేటు ల్యాబ్‌ల్లో రక్త పరీక్షలు చేయించాలని సూచిస్తున్నారు. ప్రైవేటు ల్యాబ్‌ల్లో ఒక్కొక్కరి నుంచి రూ.2500పైగా వసూలు చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. సుమారు రూ.2 లక్షల విలువైన సీబీపీ యంత్రాన్ని నిరుపయోగంగా మార్చడంపై విమర్శలు వస్తున్నాయి.

త్వరలో అందుబాటులోకి తెస్తాం

సీబీపీ యంత్రాలకు కెమికల్స్ రీఏజెన్సీస్ పంపిణీ చేయకపోవడంతో పక్కన పెట్టాల్సి వచ్చింది. రసాయనాల సామగ్రి జిల్లా కేంద్రానికి వచ్చింది. త్వరలో తీసుకొచ్చి సీబీపీ యంత్రాన్ని వాడుకలోకి తెస్తాం.

- అమూల్య, వైద్యాధికారి

జిల్లా పదో అదనపు కోర్టు జడ్జిగా ప్రియదర్శిని




గురజాల, న్యూస్‌టుడే: గురజాల 10వ అదనపు జిల్లా కోర్టు జడ్జిగా జి.ప్రియదర్శిని శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు గుంటూరు 4వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఆయన నుంచి ప్రియదర్శిని బాధ్యతలు తీసుకున్నారు. విశాఖపట్నానికి చెందిన ఈమె అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తూ జిల్లా జడ్జిగా ఎంపికై గురజాలకు మొదట పోస్టింగ్ చేరారు. పలువురు ఆమెను అభినందించారు.

ఆర్డీవోల బాధ్యతల స్వీకరణ



రమణకాంత్‌రెడ్డి

సత్తెనపల్లి : సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీవో)గా గాజులపల్లి వెంకట రమణకాంత్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన గురజాల నుంచి ఇక్కడికి వచ్చారు. జవాబుదారీతనం, పారదర్శకత, వేగంగా రెవెన్యూ సేవల్ని ప్రజలకు అందిస్తామని ఆర్డీవో చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిశారు.



మురళీ కృష్ణ

గురజాల, న్యూస్‌టుడే: గురజాల ఆర్డీవోగా మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సత్తెనపల్లి నుంచి గురజాలకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

మాచర్ల పురపాలక కమిషనర్..



వేణుబాబు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్ల మున్సిపాలిటీ కమిషనరుగా ధూళిపాళ్ల వేణుబాబు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గుంటూరు కార్పొరేషన్లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై మాచర్లకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన వెంకటదాసు ప్రకాశం జిల్లాకు బదిలీ ఆయ్యారు.

గాయత్రీమాత.. నమోస్తుతే



నకరికల్లు అన్నపూర్ణాదేవి



కారంపూడిలో గాయత్రీదేవి



చేజర్ల పార్వతీదేవి



అమరావతి: ధనలక్ష్మీ అమ్మవారు



పిడుగురాళ్లలో గంగమ్మతల్లి



పిడుగురాళ్ల: నాగులగుడిలో అమ్మవారు



సత్తెనపల్లి: వడ్డవల్లి పోలేరమ్మ



సత్తెనపల్లి: ఫిరోజ మందిరంలో కోటి కుంకుమార్చన

గాయత్రీదేవి నమోస్తుతే అంటూ భక్తులు అమ్మవారి పూజలు చేశారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పలుచోట్ల మహిళలు కుంకుమార్చన, బతుకమ్మ పూజలు నిర్వహించారు.
- న్యూస్‌టుడే, సత్తెనపల్లి



అమరావతి: బాలచాముండికా



సత్తెనపల్లి: గాయత్రీదేవిగా నీలంపాటి శ్రీలక్ష్మి



సత్తెనపల్లి: బతుకమ్మకు మహిళలు, చిన్నారుల పూజలు



నర్సింగపాడులో కౌమారీదేవిగా..



మాచవరం: వారాహీ దేవిగా వాసవీమాత



దాచేపల్లిలో అంకమ్మతల్లి



పిడుగురాళ్ల: రాజరాజేశ్వరి దేవి



సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గా పీఠంలో త్రినయని



మాచర్లలో వాసవీమాత



ఎమ్మాజీగూడెంలో గాయత్రీదేవి



రాజుపాలెం: అకులగణపవరంలో..




క్రోసూరులో..



అచ్చంపేటలో లక్ష్మీదేవి అలంకరణ



గురజాల: రజత కవచాలంకరణలో కన్యకాపరమేశ్వరి



ఎమ్మాజీగూడెంలో గాయత్రీదేవి

న్యాయవాదుల ఆందోళన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన న్యాయ చట్టాలను నిరసిస్తూ స్థానిక తాలుకా కోర్టు ఆవరణలోని న్యాయదేవత విగ్రహం వద్ద శుక్రవారం న్యాయవాదులు ఆందోళన చేశారు. న్యాయవాదుల హక్కులను కాలరాసే చట్టాలను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

గురజాల: అడ్వకేట్స్ యాక్ట్ అమెండ్‌మెంట్ బిల్లు 42ను వ్యతిరేకిస్తూ గురజాల న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సభ్యులు చల్లారామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్‌జడ్జి న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి పి.మణి, న్యాయవాదులు కె.కోటేశ్వరరావు, ఎస్.కె.మౌలాలి, ఎ.నవ్య, ప్రశాంత్ నాయక్, అయాజ్, రూత్ బనియన్, సీతారామయ్య, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

'జాతీయ బాలల పార్లమెంటు'లో ధర్మవరం విద్యార్థిని

దుర్గి, న్యూస్‌టుడే: భోపాల్ నగరంలో ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు జరిగిన జాతీయ బాలల పార్లమెంటు సమావేశాలో దుర్గి మండలం ధర్మవరానికి చెందిన విద్యార్థిని సిరిలతారెడ్డి పాల్గొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో మండల విద్యార్థినికి చోటు దక్కింది. అలాగే దుర్గి పాఠశాల ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దాచేపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని అలంకార్ థియేటర్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఇరికేపల్లి గ్రామానికి చెందిన కృష్ణ, సీతారామాంజనేయరెడ్డి ద్విచక్ర వాహనంపై దాచేపల్లికి వస్తుండగా గుంటూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. కృష్ణ తీవ్రంగా గాయపడగా.. సీతారామాంజనేయరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.

రైళ్లకు హాల్ట్ కల్పించండి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: హైదరాబాద్, విజయవాడ, విశాఖ, తిరుపతి తదితర నగరాలకు వెళ్లేందుకు పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పల్నాడు రైలుకు హాల్ట్ కల్పించాలంటూ ప్రజాసంఘాలు, కూటమి నేతలు శుక్రవారం రైల్వే జోనల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి నివేదించారు. శుక్రవారం విజయవాడ రైల్‌మహల్‌లో రైల్వే అధికారిని కలిసి ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ కోసం 30 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నామని వివరించారు. పల్నాడుతోపాటు రేపల్లె నుంచి సికింద్రాబాద్ వెళ్లే ప్యాసింజర్ రైలుకు హాల్ట్ కల్పించాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు చలపతిరావు, అరసం నేత శరత్, రైతు సంఘం సహాయ కార్యదర్శి శేషారావు, కూటమి నేతలు రమేష్, రాంగోపాలరావు, బాబు, అప్పారావు, అక్బర్, సర్పంచి రాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారే కాలువ..



అబ్బరాజుపాలెం ప్రధాన రహదారిపై నిత్యం వృథా నీరు ప్రవహిస్తోంది. ఇక్కడి కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో మురుగు నీరు వెళ్లే దారి లేకుండా పోయింది. నిత్యం నీటి ప్రవాహంతో రహదారి కోతకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సమీపంలో పాఠశాల, పాలకేంద్రం, ఆలయాలు ఉన్నాయి. విద్యార్థులు, పశుపోషకులు, భక్తులు ఎక్కువగా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ఆక్రమణలు తొలగించి, శాశ్వత మురుగు పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, పెదకూరపాడు

స్తంభం.. శిథిలం



సత్తెనపల్లి 3వ వార్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురు వీధిలో విద్యుత్తు స్తంభం కూలిపోయేలా ఉంది. స్తంభం దెబ్బతినడంతోపాటు అధికంగా తీగల లోడు ఉండటంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందనే ఆందోళన స్థానికుల్లో ఉంది. అధికారులు స్పందించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సత్తెనపల్లి

నేడు విద్యుత్తు అంతరాయం

బెల్లంకొండ: బెల్లంకొండ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో మరమ్మతుల పనుల రీత్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ పవన్ కుమార్ తెలిపారు.

జిల్లా ఖోఖో జట్టుకు ఎంపిక

కారంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనే జిల్లా ఖోఖో జట్టుకు స్థానిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థిని దేవి బాయి ఎంపికైంది.

గురువులు ఆదర్శ జీవితం గడపాలి



గురువును ఆశీర్వదిస్తున్న ఆర్‌సీఎం బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య, ఫాదర్లు

తాడువాయి(అచ్చంపేట), న్యూస్‌టుడే: గురువులు ఆదర్శజీవితం గడుపుతూ క్రీస్తు అడుగుజాడల్లో పయనించాలని ఆర్‌సీఎం బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య కోరారు. శుక్రవారం తాడువాయి ఆర్‌సీఎం తిరుకుటుంబ దేవాలయంలో జరిగిన కోట రాజమోహన్ గురుపట్టాభిషేక మహోత్సవంలో ఆయన మాట్లాడారు.

అవినీతి నిర్మూలిద్దాం



2కె రన్‌లో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: జూలకల్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవంలో భాగంగా బ్యాంకు ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బ్యాంకు మేనేజరు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

2కె రన్: పిడుగురాళ్ల చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ యార్డు వద్ద బ్యాంకు ఛైర్మన్ 2కె రన్ ప్రారంభించారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో ఓట్ల నమోదుకు తెదేపా ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక రఘురాంనగర్లోని తెదేపా ప్రజావేదికలో శుక్రవారం పట్టభద్రుల ఎన్నికపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు చొరవ చూపించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర కార్యదర్శులు వందనా దేవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సాయినిఖిల్

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: బ్రాహ్మణపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంతో మృతి చెందిన కార్మికులు కుటుంబాలకు, క్షతగాత్రులకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు సాయినిఖిల్ ద్వారా ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. పట్టణంలోని సీతారామపురం తండా ప్రాంతానికి సాయినిఖిల్ వెళ్లి వడితే చిన గోపినాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. అలాగే ప్రజాశక్తినగర్‌లో యాసారపు గోపాల్ మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు రూ.25 వేలు అందజేశారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదినారాయణ, కృష్ణ, స్వామినాయక్, తిరుపతయ్యను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.5 వేలు అందజేశారు. ఇటీవల భారీ వర్షానికి ఆరో వార్డులో ఉండే బాద్యానాయక్ ఇల్లు దెబ్బతింది. ఆయనకు రూ.20 వేలు ఆర్థిక సహాయం చేశారు.

సిబ్బంది బదిలీలతో వెలవెల



ఖాళీగా తహసీల్దారు కార్యాలయం

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: సత్తెనపల్లి తహసీల్దారు కార్యాలయం శుక్రవారం వెలవెలబోయింది. సిబ్బంది బదిలీతో అర్జీదారులు, సందర్శకులకు నిరాశ ఎదురైంది. కలెక్టరేట్‌కు సీఎస్‌డీటీ అరుణాదేవి, నరసరావుపేటకు ఆర్ఐ ఆదియ్య, సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయానికి సీనియర్ సహాయకుడు బి.సుబ్బారావు, అచ్చంపేటకు జూనియర్ సహాయకుడు వెంకటేశ్వర్లు, ముప్పాళ్లకు సబార్డినేట్ కొండమ్మ బదిలీ కాగా.. వారంతా గురువారం రిలీవ్ అయ్యారు. వారి స్థానాల్లో కొత్తవారు బాధ్యతలు స్వీకరించకపోవడంతో కార్యాలయం బోసిపోయింది.

పల్నాట నిత్యం దాడులే..!



మాచవరం, న్యూస్‌టుడే

ప్రభుత్వం మారినా పల్నాడు దాడులు ఆగడం లేదు. గతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రతి పక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగుతీసి అడుగు పెడితే చాలు అక్రమ కేసులు, దాడులు, స్టేషన్లకు పిలిపించి బెదిరించడం, కొట్టించడం, అవమానించడం వంటివి జరిగాయి. వాటితో విసిగిపోయిన తెదేపా శ్రేణులకు.. తమ పార్టీ అధికారంలోకి వచ్చినా దాడులు తప్పడం లేదు. అధికార పార్టీ ముఖ్య నేతలు ఎటువంటి గొడవలు జోలికి వెళ్లొద్దని స్పష్టంగా చెప్పడంతో గ్రామాల్లో శాంతియుతంగా వ్యవహరిస్తున్నారు. కానీ, వారి మంచితనాన్ని ఆసరాగా చేసుకుని వైకాపా శ్రేణులు దాడులకు తెగబడుతున్నారు. ఈక్రమంలోనే తెదేపా, వైకాపా శ్రేణుల మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి.

అడ్డుకట్ట పడేదెలా?

- ఇటీవల మాచవరం మండలం రేగులగడ్డలో వైకాపా కార్యకర్త ఒకరు మద్యం తాగి వీరంగం సృష్టించాడు. తెదేపా నేతను దుర్భాషలాడి, దాడికి పాల్పడ్డాడు. విషయం తెలిసి వెళ్లిన పోలీసుల చొక్కా పట్టుకుని దురుసుగా ప్రవర్తించాడు. గ్రామస్థులు వారించినా లెక్కపెట్టలేదు.
- తురకపాలెంలో వైకాపా నేత గ్రామ మాజీ సర్పంచిపై దాడికి పాల్పడ్డాడు. అతని చొక్కా చింపివేసి, అతని భార్య పొత్తు కడుపుపై తన్నడంతో రక్తస్రావమైంది. వెంటనే బాధితురాలిని ఆసుపత్రిలోకి తీసుకెళ్లి చికిత్స అందించారు. గత నెలలో ఇదే వ్యక్తి తెదేపా నేతపై దాడికి పాల్పడగా.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.
- గత ఆగస్టులో దాచేపల్లి మండలం కేసానుపల్లిలో తెదేపా నాయకుడు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, స్థానిక వైకాపా నేత రెచ్చగొట్టేలా మాట్లాడారు. దాంతో ఇద్దరికీ వాగ్వాదం జరిగింది. వైకాపా నేత పక్కనే ఉన్న బండరాయితో తెదేపా నేత తలపై పగులగొట్టాడు.
- గురజాల మండలం గోగులపాడులో వైకాపా వర్గీయులు, తెదేపా శ్రేణులపై దాడికి పాల్పడగా ఇద్దరి తలలు పగిలి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.
- అమరావతి మండలం మల్లాదిలో స్థానిక ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వైకాపా శ్రేణులు చింపివేయడం కలకలం రేపింది.
- అమరావతి మండలం ఉంగుటూరులో తెదేపా కార్యకర్తపై, వైకాపా మూకలు దాడి చేసి గాయపరిచాయి.
- గణేష్ ఉత్సవాల్లో భాగంగా బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, పాపాయపాలెంలో గొడవలు జరిగాయి.

భవన నిర్మాణ కార్మికుల నిరసన

అమరావతి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇసుకను అందుబాటులో ఉంచి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపి ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు సూరిబాబు కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలియజేసి తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు న్యాయం చేయాలని విన్నవించారు.

మాచర్ల (కారంపూడి): ఉచితంగా ఇసుక అందించాలని సీపీఎం నాయకుడు ఆంజనేయులు నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు.

క్రోసూరు(అచ్చంపేట): ఇసుక అందరికీ అందుబాటులో ఉంచాలని భవన నిర్మాణ కార్మికులు కోరారు. క్రోసూరు తహసీల్దార్ కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

సత్తెనపల్లి గ్రామీణ: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని పారదర్శకంగా అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి అవ్వారు ప్రసాదరావు డిమాండు చేశారు. సత్తెనపల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం, కార్మిక సంఘ నాయకులు, కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు.

తెదేపా కార్యకర్త మృతికి సంతాపం

మాచర్ల (కారంపూడి): తెదేపా సీనియర్ నాయకుడు బాలశౌరి (76) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి నివాళి అర్పించారు. బాలశౌరి తెదేపా ఆవిర్భావం నుంచి నిస్వార్థంగా పార్టీ అభివృద్ధికి పని చేశారన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక చేయూతనందించారు.

కారంపూడి: కారంపూడికి చెందిన తెదేపా కార్యకర్త తిరుమలశెట్టి విజయ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి సంతాపం తెలియజేశారు. స్థానిక నాయకులు బాలకృష్ణ, మస్తాన్‌జని, సురేష్‌యాదవ్, బాలూనాయక్ మృతదేహాన్ని సందర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు.

మాజీ సర్పంచి మృతి

సత్తెనపల్లి గ్రామీణ: గర్నెపూడి పంచాయతీ మాజీ సర్పంచి బాపిరెడ్డి శుక్రవారం మృతిచెందారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సత్తెనపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మరణించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

మాచర్ల: రైల్వే ట్రాక్ పక్కన మృతి చెందిన అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు సీఐ ప్రభాకరరావు వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డిని సంప్రదించారు. దీంతో ఛారిటీ సభ్యులు శుక్రవారం మృతదేహాన్ని ఖననం చేశారు.